

మాట్లాడుతున్న బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.రాజారమేశ్

# దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను అడుగడుగునా నిర్బంధించాలి
- బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి డా.రాజారమేశ్

చెన్నూర్ టౌన్, నవంబర్ 28 : జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించతలపెట్టిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం చెన్నూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గుర్తు చేసుకుంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో 2009, నవంబర్ 29న ఆమరణ దీక్షకు పూనుకున్నారని, ఈ నేపథ్యంలో కేసీఆర్ అరెస్టుతో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని తెలిపారు. బక్కపలుచని వ్యక్తితో ఏమవుతుందని ఆ రోజు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాట్లాడారని, వారు కేసీఆర్ బలమే చూశారు కానీ.. బలగం గురించి, సంకల్పం గురించి మరిచిపోయి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. నాడు సబ్బండ వర్గాలు ఒక్కటై కేసీఆర్‌కు అండగా నిలిచాయని, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని పేర్కొన్నారు. 'నా దీక్ష వల్ల తెలంగాణ వస్తే జైత్రయాత్ర.. లేకుంటే నా శవయాత్ర ఉంటుంది' అని కేసీఆర్ చెప్పడంతో కేంద్రం దిగిరాక తప్పలేదని చెప్పారు. పదేండ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దులా ముందుకు తీసుకెళ్లాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రేవంత్ పాలన గాడితప్పిందని, విద్యార్థులు మృతి చెందుతున్నారని, అనేక సంఘాలు రోడ్డెక్కుతున్నాయని తెలిపారు. దొంగహామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిర్బంధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మరోసారి నాటి ఉద్యమ స్ఫూర్తిని, అనేక త్యాగాల పునాదుల మీద ఏర్పడిన ఉద్యమ ప్రస్థానం గురించి ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఈ కార్యక్రమానికి దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి తుల ఉమ, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని, బీఆర్ఎస్ శ్రేణులు, జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చెన్నూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు జోడు శంకర్, తుమ్మ రమేశ్, రేవెల్లి మహేశ్, జగన్నాథుల శ్రీను, వేల్పుల సుధాకర్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు నాయని సతీశ్, అరీఫొద్దీన్, మేడ సురేశ్, మహేందర్, పాశం ఆశిష్, నాయబ్, జడల మల్లేశ్, తగరం శంకర్, ప్రశాంత్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

## దీక్షా దివస్‌కు తరలిరావాలి

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 28 : తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆమరణ నిరహారదీక్ష తలపెట్టిన రోజును స్మరించుకుంటూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని నస్పూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఓ ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.



ఖర్జీ ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కూమార్‌దీపక్

# ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కూమార్ దీపక్

నెన్నెల, నవంబర్ 28 : ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచే అధికారికంగా రవాణా చేయాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కూమార్‌దీపక్ హెచ్చరించారు. గురువారం నెన్నెలలో పర్యటిస్తుండగా, ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండటాన్ని గమనించి ఆపారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఖర్జీ ఇసుక రీచ్‌కు వెళ్లి పరిశీలించారు. ఇసుక నింపుతున్న కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే నేరుగా ఇంటికి చేర్చుతారన్నారు. ఆపై గొల్లపల్లి, నెన్నెల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆ తర్వాత గొల్లపల్లిలోని పాఠశాలలో వంటలను పరిశీలించారు. ఆహార నిల్వలు, గదులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వంట సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నాణ్యమైన బోధనతో పాటు భోజనం కూడా అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దామోదర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

## అడవులను రక్షించాలి : డీఎఫ్‌వో నీరజ్‌కుమార్



గూడెం, శివపెల్లి సెక్షన్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

చింతలమానేపల్లి, నవంబర్ 28 : అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గూడెం, శివపెల్లి సెక్షన్ పరిధిలోని గూడెం బేస్ క్యాంపు, శివపెల్లి సెక్షన్‌లోని మామిడి ఉట్లు, శివపెల్లి వాటర్‌ఫాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అడవిలో చెట్లను నరకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పశువుల కాపరులు అడవిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ఇక్బాల్, డిప్యూటీ ఆర్వో సంతోష్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు మోహన్, సూర్యరావ్, బీట్ అధికారులు, నవ్యశ్రీ, ప్రభాకర్, దనేశ్, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.



బెజ్జూర్‌లో కమ్ముకున్న పొగమంచు.. ఉదయిస్తున్న సూర్యుడు



సిర్పూర్(యు)లో నెగడి వద్ద చలికాగుతున్న ఆదివాసులు

# ఇదేం ఇగం

- పంజా విసిరిన చలి
- ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- గజగజ వణికిపోతున్న ప్రజలు



నిర్మానుష్యంగా మంచిర్యాలలోని ప్రధాన రహదారి



లింగాపూర్‌లో చలికి తట్టుకోలేక దుప్పటి కొప్పుకొని వెళ్తున్న వ్యక్తి

*ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలపై చలి పంజా విసిరింది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోగా, గడ్డకట్టుకుపోయే పరిస్థితి తలెత్తింది. గురువారం సిర్పూర్(యూ)లో కనిష్ఠంగా 8.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోగా.. ప్రజానీకం గజగజ వణికిపోయింది. ఆయాచోట్ల ఉదయం 9 గంటల దాకా పొగమంచు తొలగ లేదు. వాహనాల రాకపోకలకు డ్రైవర్లు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇగ సాయంత్రం ఆరింటికే ఇగం మొదలుకాగా, రోడ్లపై సందడి కనిపించలేదు. ఇదెక్కడి చలిరా బాబోయ్ అంటూ చిన్నా.. పెద్దలంతా చలి మంటలు కాగుతూ కనిపించారు.*

- సిర్పూర్(యూ)/లింగాపూర్/బెజ్జూర్/హాజీపూర్/మంచిర్యాల స్టాఫ్ ఫోటోగ్రాఫర్, నవంబర్ 24



హాజీపూర్ మండలం గుడిపేట వద్ద పొగ మంచు



బెజ్జూర్‌లో దట్టమైన పొగమంచులో వాకింగ్ చేస్తున్న యువకులు

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్
- పాల్గొన్న కోవ లక్ష్మి, డీఈవో యాదయ్య



వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 28 : విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ 52వ బాలల వైజ్ఞానిక ప్రదర్శన అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఈవో యాదయ్యతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైన్స్, గణితాన్ని ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. నేను సైన్స్, గణితంలో వందకు వంద మార్కులు తెచ్చుకున్నానని తెలిపారు. సమస్యకు పరిష్కారం చూపడానికి, నూతన ఆవిష్కరణలకు సైన్స్, గణితము దోహదపడుతాయన్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులన్నారు. విద్యా అవకాశాలను మెరుగుపరచడం కోసం ప్రభుత్వాలు సరైన వసతులు కల్పించాల్సిన అవసరముందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వాటి పనితీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఢిల్లీ సీనియర్ అసోసియేట్ శుభదీప్ బెనర్జీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సెయింట్ మేరీ పాఠశాల ప్రిన్సిపాల్ త్రిష్యమ్మ, ఎంఈవో వాసాల ప్రభాకర్, డీఈవో కార్యాలయం ఎఫ్ఏవో దేవాజీ, ఏసీజీ ఈ ఉదయ బాబు, ఆసిఫాబాద్ ఎమ్మార్వో సుభాష్, ఏసీఎంవో ఉద్ధవ్, కార్యక్రమ కో కన్వీనర్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, అధికారులు, నాయకులు ధర్మపురి వెంకటేశ్వర్లు, చారి, ఊశన్న పాల్గొన్నారు.

# యూనిఫాంల పంపిణీ ఎప్పుడో..?



అంగన్‌వాడీలకు అందించనున్న యూనిఫాంలు

## అంగన్‌వాడీ పిల్లలకు అందించడంలో సర్కారు నిర్లక్ష్యం

- జూలైలో ఇవ్వాల్సి ఉన్నా.. నేటికీ పట్టింపు కరువు
- కుట్టు పూర్తయినా.. ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 28 : అంగన్‌వాడీ పిల్లలకు ఇవ్వాల్సిన యూనిఫాంలపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నిజానికి జూలైలోనే అందించాల్సి ఉండగా, నవంబర్ పూర్తికావస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. కుట్టే ప్రక్రియ పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉండగా, పై నుంచి ఆదేశాలు రాక మూలన పడేసినట్లుగా తెలుస్తున్నది.

### ఊసెత్తని సర్కారు

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 43,824 మంది పిల్లలు చదువుకుంటున్నారు. జిల్లాలో లక్సెట్టిపేట, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లిలో నాలుగు ఐసీడీఎస్ కేంద్రాలుండగా, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న 319 అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు యూనిఫాంలు పంపిణీ చేయాలని సర్కారు నిర్ణయించింది. తొలి విడుతలో 1784 బాలురు, 1825 బాలికలకు అందించాలనుకున్నది. నీలిరంగు నిక్కర్ల కోసం 1306 మీటర్లు, ఎరుపు రంగు షర్టు, ఫ్రాకు కోసం 5059 మీటర్లు, తెలుపు రంగు కోసం 920 మీటర్ల బట్టను టెస్కో ద్వారా సేకరించారు. కుట్టు బాధ్యతలను సెర్ప్, మహిళా సంఘాలకు అప్పగించారు. వాస్తవానికి జూలైలోనే పిల్లలకు యూనిఫాంలు అందించాల్సి ఉంది. కానీ అనేక కారణాల దృష్ట్యా ఆలస్యమైంది. ప్రస్తుతం కుట్టు పూర్తయినా ప్రభుత్వం పంపిణీ ఊసెత్తడం లేదు. విద్యా సంవత్సరం పూర్తికావస్తోందని, ఇంకెప్పుడు యూనిఫాంలు అందిస్తారని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

### పట్టింపు కరువు

కేసీఆర్ సర్కారు బడులు, అంగన్‌వాడీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేసింది. కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యనందించింది. అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై పట్టింపు కరువైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీలను పటిష్టం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. కనీసం పిల్లలకు అందించే యూనిఫాంలపైనా ఇంతటి నిర్లక్ష్యమెందుకని పలు విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



మంచిర్యాల అశోక్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రం

### ❖ త్వరలోనే పంపిణీ చేస్తాం..



యూనిఫాంల స్టిచ్చింగ్ పూర్తయ్యింది. జిల్లాకు చేరుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం. మరో రెండు వారాల్లో చిన్నారులకు యూనిఫాంల పంపిణీ జరుగుతుందని ఆశిస్తున్నాం.

- స్వరూపారాణి, జిల్లా సంక్షేమాధికారిణి

## లచ్చన్న లొంగిపో..



లచ్చన్న కుటుంబ సభ్యులకు దుప్పట్లు అందజేస్తున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

కోటపల్లి, నవంబర్ 28 : పుట్టిన ఊరికి.. అయిన వాళ్లకు దూరంగా అడవిలో జీవితం గడుపుతున్న మావోయిస్టు నేత ఆత్రం లచ్చన్న లొంగిపోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం లచ్చన్న స్వగ్రామమైన పారుపల్లికి చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌తో కలిసి వెళ్లి అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. లచ్చన్న వదిన ఆత్రం లచ్చక్కకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందజేశారు. మావోయిస్టులు లొంగిపోవాలనుకుంటే తనను సంప్రదిస్తే ప్రభుత్వంతో మాట్లాడి వారికి పునారావాసం కల్పించడంతో పాటు కేసులు ఎత్తివేసేలా కృషి చేస్తామని చెప్పారు. ఉదయం స్థానిక గుట్టపై వెలసిన భైరవ దేవుడికి జైపూర్ ఏసీపీ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుడు రాజేశ్ ఉన్నారు.

### పోలీస్‌స్టేషన్ తనిఖీ

చెన్నూర్ టౌన్, నవంబర్ 28 : వార్షిక తనిఖీల్లో భాగంగా చెన్నూర్ పోలీస్ స్టేషన్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దర్యాప్తు జరిగిన కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. సీఐ రవీందర్, ఎస్ఐ, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని రేవంత్‌రెడ్డి విగ్రహం ముందు శాంతిదీక్ష



రేవంత్‌రెడ్డి విగ్రహం ముందు దీక్ష చేస్తున్న సకినాల నారాయణ

బెల్లంపల్లి, నవంబర్ 28 : హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓ మాజీ హోంగార్డు వినూత్న నిరసనకు దిగాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన సకినాల నారాయణ తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని మరీ గురువారం శాంతియుత దీక్ష ప్రారంభించాడు. రాష్ట్రంలోని హోంగార్డులను పర్మినెంట్ చేయాలని, తొలగించిన హోంగార్డులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశాడు. ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు గుడ్ సర్వీస్ కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ శాంతిదీక్షను కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ ఎస్ఐ మహేందర్ అక్కడికి చేరుకుని ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.